


# సూర్య

www.suryaa.com


19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం,28 డిశంబర్ 2025 | 8 పేజీలు


## వాడపల్లి క్షేత్రం

# భక్తజన సంద్రం





- ఈవో చక్రధర్‌రావు పర్యవేక్షణలో భక్తులకు 'రాజ' సౌకర్యాలు!
- లక్షలాది మంది వచ్చినా చెదరని ఏర్పాట్లు..
- భక్తుల మనసు గెలుచుకున్న 'నల్లం' సమర్థ పాలన !

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. ఎటు చూసినా గోవింద నామ స్మరణలు, క్యూలైన్లలో కిక్కిరిసిన భక్త కోలాహలం కనిపించింది. అయితే, ఈ భారీ రద్దీని సైతం అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొని, భక్తులకు ఎక్కడా చిన్నఅసౌకర్యం కలగకుండా చేయడంలో ఆలయ ఈవో నల్లం సూర్య చక్రధర్ రావు తన మార్క్ అడ్మినిస్ట్రేషన్‌ను చాటుకున్నారు.

**ముందస్తు వ్యూహం - ముచ్చటైన ఏర్పాట్లు :** శనివారం రద్దీ అంచనా వేసి, ఈవో నల్లం సూర్య చక్రధర్ రావు ముందుగానే వ్యూహాత్మక ఏర్పాట్లు చేశారు.

**వేగవంతమైన దర్శనం :** తెల్లవారుజామున సుప్రభాత సేవ మొదలుకొని అన్ని పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తూనే, సామాన్య భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం కలిగేలా క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించారు.

**ఆకలి తీర్చిన అన్నప్రసాదం :** వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎక్కడా లైన్లు ఆగకుండా నిరంతరం అన్నప్రసాద

- తరువాయి 2లో..

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా మార్కెట్ కమిటీ పనిచేయాలి..

- ఎమ్మెల్యే నల్లమిల్లి



**అనపర్తి,మేజర్‌న్యూస్ :** మార్కెట్ కమిటీ రైతులకు అండగా ఉంటూ, రైతుల సంక్షేమము, అభివృద్దే లక్ష్యంగా పనిచేయాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో అనపర్తి నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ అభివృద్ధి గురించి తీసుకోవలసిన చర్యల గురించి చర్చించారు. ఛైర్మన్ జుత్తుగ సూర్యకుమారి, వైస్ ఛైర్మన్ కోనాల వెంకటరెడ్డి మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొనగా మార్కెట్ కమిటీ కార్యాలయం అదనపు గదుల నిర్మాణం, ప్రహారీ నిర్మాణం, అనపర్తి రైతు బజార్‌ని అభివృద్ధి పరచడం తదితర అంశాలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

రైతులకు మేలు చేసే విధంగా,అవినీతిరహితంగా మార్కెట్ కమిటీ కార్యకలాపాలు సాగించాలని,కమిటీ సూచించిన అభివృద్ధి కార్యక్రమాలను అమలుపరచడంపై తాను దృష్టి పెడతానని ఎమ్మెల్యే నల్లమిల్లి తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేయవలసిన టార్పాలిన్‌లను ఏవోలకు అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సూర్యకుమారి, వైస్ ఛైర్మన్ వెంకటరెడ్డి, ఏఎంసీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'సూర్య' కథనంపై స్పందించిన యంత్రాంగం!

## అక్రమార్కుల

# 'అడ్డా'పై కొరడా



- కాకినాడ 'సంతచెరువు' ముఠా గుట్టురట్టు..
- రంగంలోకి దిగిన నగరపాలక సంస్థ
- రూ.కోట్ల జీఎస్టీ ఎగవేతపై విజిలెన్స్ విచారణ
- కాలువల ఆక్రమణలపై కెఎంసి ఉక్కుపాదం
- క్షేత్రస్థాయిలో నగరపాలక సంస్థ కమిషనర్ తనిఖీలు..కీలక ఆదేశాలు

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

వ్యాపార ముసుగులో వ్యవస్థను మేసేస్తున్న 'తిమింగలాల' గుట్టును 'సూర్య'లో కాకినాడ సంత చెరువు సాక్షిగా సర్కార్ ఖజానాకు కన్నం కథనంతో శనివారం బట్టబయలు చేయడంతో నగరంలో పెనుసంచలనం

- తరువాయి 2లో..





# అక్రమార్కుల 'అడ్డా'పై కొరడా

మొదటిపేజీ తరువాయి

నమోదైంది. పండుగ సీజన్‌ను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్న రెడీమేడ్ మాఫియా ఆగడాలపై 'సూర్య' ప్రచురించిన కథనం నేరుగా అధికారులకు సమస్య తీవ్రతం తెలిపింది. ఫలితంగా, శనివారం ఉదయం నుంచే కాకినాడ నగరపాలక సంస్థ ఇన్-ఛార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ నేతృత్వంలో భారీ ప్రక్షాళన కార్యక్రమం మొదలైంది.

**కాలువలపై కబ్జా.. అక్రమ సామ్రాజ్యానికి 'చెక్'**

సంతచెరువు పరిసరాల్లో రెడీమేడ్ వ్యాపారస్తులు దుకాణాలను మించి ఏకంగా రోడ్లపైకి, కాలువలపైకి చొచ్చుకువచ్చిన తీరుపై కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువలపై సిమెంట్ దిమ్మలు వేసి, మురుగు నీరు వెళ్లే మార్గం లేకుండా చేసి, నగరాన్ని మురికి కూపంగా మారుస్తున్న వ్యాపారస్తుల చర్యలను ఆయన క్షమించరాని నేరంగా అభివర్ణించారు.

**తక్షణ చర్యలు :** శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్వైజర్లను ఆదేశించి కాలువలపై ఉన్న అక్రమ కట్టడాలను జేసిబితో ధ్వంసం చేయించి చేయ్యాలని, రోడ్డు, కాలువలపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని కమీషనర్ సత్యనారాయణ ఆదేశించారు.

**ప్రజా సౌకర్యం ముఖ్యం:** "వ్యాపారం పేరుతో ప్రజల ఆరోగ్యాన్ని, రహదారి భద్రతను పణంగా పెడితే సహించేది లేదు" అని కమిషనర్ స్పష్టం చేయడం అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనం.

**బహుముఖ దాడులు :** కమర్షియల్ టాక్స్ విజిలెన్స్ అలెర్ట్

'సూర్య' కథనంలో ప్రధానంగా ప్రస్తావించిన రూ.కోట్ల జీఎస్టీ ఎగవేత అంశం రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో ప్రకంపనలు సృష్టించింది.

నగదు రూపంలోనే లావాదేవీలు: బిల్లులు లేకుండా, కేవలం తెల్ల కాగితాలపై వ్యాపారం చేస్తూ ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయాన్ని మళ్లించడాన్ని సీరియస్ గా తీసుకున్నారు.

అధికారుల అండపై ఆరా: ఈ మాఫియా వెనుక ఉన్న కమర్షియల్ టాక్స్ అధికారుల హస్తంపై విజిలెన్స్ విభాగం అంతర్గత విచారణ ప్రారంభించినట్లు సమాచారం.

"అక్రమ కట్టడాలు తొలగింపు కేవలం ఆరంభం మాత్రమే.. నిబంధన అతిక్రమిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదు". ఎన్.వి.వి. సత్యనారాయణ, ఇన్-ఛార్జ్ కమిషనర్.

**ప్రజల హర్షం - 'సూర్య' పక్షపాతి**

సంక్రాంతి వేళ సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతూ, నగర రూపురేఖలను చెరిపేస్తున్న అక్రమార్కులపై 'సూర్య' గళం ఎత్తడం పట్ల కాకినాడ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "ప్రజా సమస్యలను గుర్తించి, అధికారులను కదిలించేలా కథనాలు రాయడం కేవలం బాధ్యతాయుతమైన పత్రికలకే సాధ్యం" అని స్థానిక ప్రజలు కొనియాడుతున్నారు.

విశ్లేషణ: వ్యవస్థను సరిదిద్దిన పత్రికా ధర్మం

ఈ ఉదంతం ద్వారా ఒక పత్రిక కేవలం సమాచారం అందించడమే కాకుండా, పౌర సమాజం పట్ల తనకున్న బాధ్యతను నెరవేర్చింది. అటు పన్నుల ఎగవేతను, ఇటు పౌర సమస్యలను ఏకకాలంలో వెలుగులోకి తెచ్చి, అధికారులను చేయడంలో 'సూర్య' విజయం సాధించింది.

# రంగా జీవితం ఆదర్శనీయం : 'దేశం' నేత నాయుడు

**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహన రంగా 37వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం చిట్టవరం మదన గోపాల స్వామి వారి ఆలయం దగ్గర రంగా విగ్రహ నిర్మాణ కర్త విస్సా వెంకటేష్ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజ రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదల అభివృద్ధి కోసం రంగా ఎనలేని కృషి చేశారని, జీవించినంత కాలం పేద ప్రజల వెంటే ఆయన ఉన్నారని అన్నారు. రంగా జీవించిన సమయం తక్కువే అయినా తరతరాలకు సరిపడా కీర్తిని సంపాదించారని, అత్యున్నత పదవులు ఏమి లేకపోయినా ప్రతి పట్టణాన ప్రతి గ్రామాన విగ్రహాలు ఉన్న ఏకైక నేతగా రంగా ని అభివర్ణించారు, అటువంటి రంగా ని యువత ఆదర్శంగా తీసుకుని కుల మత వర్గ విభేదాలు లేకుండా సమాజంలోని ప్రతి సమస్యపై స్పందించి దాని పరిష్కారానికి కృషి చేయాలని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఆయన వేసిన మార్గంలో నడవాలని నాయుడు అన్నారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిట్టవరంగ్రామానికి చెందిన రంగా అభిమానులు, తెలుగుదేశం, జనసేన,బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేడు కుంతలగూడెం పంచాయతీ కార్యాలయ భవనానికి శంకుస్థాపన

**- పంచాయతీ భవన నిర్మాణం కోసం కనకాద్రిపురం వాసుల నిరసన**



**కొయ్యలగూడెం, మేజర్ న్యూస్** ఎట్టకేలకు కొయ్యలగూడెం కుంతల గూడెం పంచాయతీకి కార్యాలయ భవన నిర్మాణానికి ముహూర్తం కుదిరింది. నేడు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు రూ.32 లక్షల వ్యయంతో నిర్మించే ఈ భవనానికి శంకుస్థాపన చేసి,పునాదిరాయి వేసి,శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. యర్రంపేట పంచాయతీలోని దూర దూరంగా ఉన్న కుంతలగూడెం, కనకాద్రిపురం(ఆరిపాటిదిబ్బలు) గ్రామాలను కలిపి ఒక పంచాయతీగా 5 సం.రాల క్రితం కొత్తగా కుంతలగూడెం పంచాయతీని ఏర్పాటు చేసింది. గడిచిన స్థానిక ఎన్నికల్లో ఈ పంచాయతీని పాలకవర్గానికి కూడా ఎన్నికలు జరిగాయి. అయితే అప్పటి నుంచి, ఒక తాత్కాలిక భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. 6 నెలల క్రితం ఈ పంచాయతీకి కార్యాలయ భవన నిర్మాణం కోసం రూ.32లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ, పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎక్కడ నిర్మించాలనే విషయమై రెండు గ్రామాల నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదరక వివాదాస్పదంగా మారింది. మా గ్రామాల్లోనే నిర్మించాలని రెండు గ్రామాల నాయకులు, ప్రజలు పట్టుపట్టుకుని కూర్చున్నారు. పంచాయతీ కుంతలగూడెం పేరు మీదనే ఉన్నందున అక్కడే కార్యాలయ భవనం నిర్మించాలని ఆ గ్రామ ప్రజలు పట్టుదలగా ఉన్నారు. పంచాయతీ ఏర్పాటుకు ముందు యర్రంపేట పంచాయతీ విభజన సమయంలో కనకాద్రిపురం(ఆరిపాటిదిబ్బలు)లోనే పంచాయతీ కార్యాలయ భవనం ఉండాలన్న షరతుతోనే తాము కుంతలగూడెం పంచాయతీలో చేరామని, అందువల్ల ఆరిపాటిదిబ్బల వద్దే కార్యాలయ భవనం నిర్మించాలని కనకాద్రిపురం వాసులు పట్టుబడుతున్నారు. 2011 జనాభా వివరాల ప్రకారం చూస్తే.. కుంతలగూడెంలో 905మంది, కనకాద్రిపురంలో 360 మంది ఉన్నారు. జనాభాను బట్టి చూసినా కుంతలగూడెంలోని కార్యాలయ భవనం నిర్మించాలని పట్టుబడుతున్నారు. కుంతలగూడెంలో 7గురు వార్డు సభ్యులు, కనకాద్రిపురంలో 2 మాత్రమే వార్డు సభ్యులు ఉన్నారు.ఈ పరిస్థితుల్లో ఇరు గ్రామాల మధ్య రాజీ కుదర్చడానికి ఎంపీడీఓ, తాహశీల్దారు, డీఎల్పీఓ, మండల ఈఓ ఆర్డీ పంచాయతీ రాజ్ ఎ.ఈలు పలుసార్లు ఆ గ్రామాలకు వెళ్లి చర్చించారు. అయితే ఎవరికి వారు పట్టుదలతో ఉండటంతో గత 6 నెలలుగా భవన నిర్మాణం జరగలేదు.ఈ పరిస్థితుల్లో కుంతలగూడెం ప్రజలు, నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కుంతలగూడెంలోనే కార్యాలయం నిర్మించాలని జిల్లా కలెక్టరుకు ఆదేశాలిచ్చింది. దీనిపై జిల్లా కలెక్టరు కూడా కుంతల గూడెంలోనే పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి ఆదేశాలిచ్చారు. ఇందుకు నిరసనగా కనకాద్రిపురం (ఆరిపాటిదిబ్బలు) వాసులు శుక్ర, శనివారం రెండురోజులు కనకాద్రిపురం పంచాయతీ తాత్కాలిక కార్యాలయం వద్ద ధర్నాతో పాటు రాస్తారోకో జరిపారు.తమ గ్రామంలో పంచాయతీ కార్యాలయ భవనం నిర్మించకపోతే వచ్చే ఎన్నికలను తమ గ్రామం బహిష్కరిస్తుందని, ఎవరూ ఓటు వేయరని ధర్నా కార్యక్రమంలో నిరసనకారులు ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక ఎంపీడీఓ తదితరులు శనివారం ఆ గ్రామాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. తాజా పరిస్థితిని ఎమ్మెల్యే బాలరాజుకు నివేదించారు. ఈనేపథ్యంలో పంచాయతీ కార్యాలయ భవనం తక్షణం చేపట్టాలని ఎమ్మెల్యే, అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే తీసుకున్న నిర్ణయం మేరకు కార్యాలయ భవనానికి శంకుస్థాపన కార్యక్రమం ఖరారైంది.

## వాడపల్లి క్షేత్రం .. భక్తజన సంద్రం

మొదటిపేజీ తరువాయి

వితరణ జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. తాగునీరు, ఎండ దెబ్బ తగలకుండా షేడ్స్ వంటి కనీస వసతులపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రవాణా సౌలభ్యం : సుదూర ప్రాంతాలైన విశాఖపట్నం, విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయించి, రవాణా ఇబ్బందులు లేకుండా చూశారు.

అధికారుల సమన్వయం - ఆదర్శ పాలన : కేవలం పర్యవేక్షణకే పరిమితం కాకుండా, ఎస్.ఐ. ఎస్.రాము బృందంతో కలిసి భద్రతా ఏర్పాట్లను క్రమబద్ధీకరించడంలో ఈవో సూర్య చక్రధర్ రావు కీలక పాత్ర పోషించారు. ఒకవైపు రద్దీని నియంత్రిస్తూనే, మరోవైపు స్వామివారికి ఒక్కరోజే రూ. 50 లక్షల ఆదాయం సమకూరేలా పారదర్శకమైన, భక్తితో కూడిన వాతావరణాన్ని కల్పించారు.

భక్తుల నీరాజనం : "భక్తే పరమావధి" గా భావించి ఈవో నల్లం సూర్య చక్రధర్ రావు నాయకత్వంలో జరిగిన ఈ అద్భుత ఏర్పాట్లు భక్తుల మన్ననలు పొందుతున్నాయి. ముదునూరి వెంకటరాజుతో కలిసి ఆలయ ప్రతిష్టను మరింత పెంచేలా ఈవో తీసుకుంటున్న నిర్ణయాలపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రజల వద్దకే పాలన

**కాకినాడ రూరల్‌లో 'ప్రజాదర్బార్'**



కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : ప్రజల సమస్యలు కార్యాలయాల్లో కాకుండా వారి మధ్యే పరిష్కారం కావాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం 'ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. శనివారం కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో 1, 2, 3 మరియు 42, 47-50 ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.

నేరుగా అర్జీల స్వీకరణ : ఆర్ఆర్ నగర్, నరసన్నగర్ ప్రాంతాల్లో జరిగిన ఈ సదస్సుల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు స్వయంగా ప్రజల నుండి వినతులు స్వీకరించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గత రాజసంప్రదాయంలా ప్రజల వద్దకే పాలనను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రభుత్వం తీసుకొచ్చిందని పంతం నానాజీ పేర్కొన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి ఫైలు కదలాలని, సమస్యకు పరిష్కారం లభించడమే తమ బాధ్యతని ఎమ్మెల్సీ రాజశేఖరం స్పష్టం చేశారు.ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, డ్రైనేజీ సమస్యలు మరియు వీధి కుక్కల బెడదపై ప్రజలు పెద్ద సంఖ్యలో వినతులు అందజేశారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగులతో అప్రమత్తముగా ఉండాలి

**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగులతో అప్రమత్తముగా ఉండాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఉషా కుమారి తెలిపారు.మండల పరిధి కృష్ణ వరం గ్రామములో శుక్రవారం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం క్రింద జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు మొక్కజొన్న పంట పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో భాగంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఉషా కుమారి మాట్లాడుతూ ఈ పురుగుల నివారణకు తొలి దశలో ఎకరాకు ఒక లీటరు వేపనూనెను పిచికారి చేయడం ద్వారా గుడ్ల సముదాయాలు,మొదటి దశ లార్వాలు నివారించబడతాయని సూచించారు. ఈ కార్యక్రమములో భాగంగా మండల వ్యవసాయ ధికారి జె.భవాని ప్రస్తుతం వ్యవసాయ శాఖలో అమలవుతున్న కార్యక్రమాలను రైతులకు వివరించారు.

# కూటమి హయాంలో ఆత్రేయపురం మండలం సమగ్ర అభివృద్ధి



- తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం
- నాయకులకు, కార్యకర్తలకు తగిన న్యాయం చేస్తాం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సత్తా చాటాలి
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. శనివారం ఆత్రేయపురం వాడపల్లి ఆలయచైర్మన్ ముదునూరివెంకటరాజు స్వగృహంలో మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయన మాట్లాడుతూ కూటమిఅధికారంలోకి వచ్చాక ఆత్రేయ పురం మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. బొబ్బర్లంక - వద్దపర్రు రహదారి పనులు త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని టెంపుల్ టూరిజం లో భాగంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. వచ్చేనెల 11, 12, 13 తేదీల్లో జరిగే సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆత్రేయపురం పేరు ప్రఖ్యాతలు ఇనుమడించేలా ఈ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రాగన్ పడవ పోటీలు, ఈత పోటీలు, లొల్ల లాకుల వద్ద ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు జరుగుతుందన్నారు. లొల్లలాకుల పునర్నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో రహదారులు డ్రైనేజీలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. 2029లో సైతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న అందరికీ ముఖ్య మంత్రి సహాయనిధి అందిస్తున్నామన్నారు. పాస్టర్లకు నెలకు రూ.5వేల చొప్పున ఒకేసారి రూ.60వేలు అందించడం జరిగిందన్నారు. ఎమ్ఎస్ఎమ్ఈ సదస్సులు నిర్వహించామని, డ్వాక్రా మహిళలు, యువత స్వయం ఉపాధికి సంబంధించిన ఆలోచన చేస్తే సబ్సిడీ రుణం అందేలా అవగాహన కోసం రావులపాలెంలో కార్యాలయం ఏర్పాటు జరిగిందన్నారు.

సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బాగా కష్టపడి పని చేసిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ప్రశంసపత్రాలు అందజేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ ఐక్యమత్యంతో కల్సి ముందుకు రావాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,జెడ్పీటీసీలు గెలవాలన్నారు. ఆత్రేయపురం మండలం నుంచి పార్టీ పదవులు, దేవాలయాల పాలకమండలి పదవులు పొందినవారిని సత్కరించారు. పార్టీ కోసం కృషి చేసే ప్రతీ కార్యకర్తకు నాయకునికి న్యాయంచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కాయలజగన్నాధం, ముళ్ళపూడి భాస్కరరావు, తోట కూర సుబ్బరాజు,జోజ్జవరపు హరిబాబు,మద్దూరి సుబ్బారావు, నాగిరెడ్డి సత్యనారాయణ మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నార

# ఉడిమూడి వారధి నిర్మాణ పనులు 65 శాతం పూర్తి





- జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** పి.గన్నవరం నాలుగు లంక గ్రామాలకు ఉడిమూడి వద్ద ప్రధాన వారధిగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు 65శాతం పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. శనివారం ఉడిముడి గంటి పెదపూడి లంక గ్రామాల వద్ద ఆసియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకు నిధులైన రూ.71.43 కోట్లతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన క్షేత్ర స్థాయిలో ఇంజనీర్లతో కలిసి పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. బ్రిడ్జ్ వద్ద అప్రోచ్ రోడ్లు నిర్మాణానికి రైతుల నుండి సేకరించిన 5.1 ఎకరాలకు భూసేకరణ నిధులు రూ.2.30 కోట్లు వారం రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయన్నారు. ఈ బ్రిడ్జి ఆస్ట్రేలియన్ సూపర్ టీ టెక్నాలజీతో నిర్మించడం పట్ల జిల్లా కలెక్టర్‌సంబంధిత ఇంజనీర్ పి.పి.రాజును అభినందించారు. ప్రస్తుతం పిల్లర్ 7,8 పనులు గోదావరి నదికి అడ్డంగా క్రాస్ బండ్లు వేసి పనులు శరవేగంగా నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూడివిజనల్ అధికారి పి.శ్రీకర్, తాసిల్దార్ పి.శ్రీపల్లవి, పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్యం రాంబాబు, గోదావరి హెడ్ వర్క్స్ డివిజనల్ ఇంజనీర్ ప్రసాద్, ఏఈలు దుర్గా, కొండలరావు, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దండు సాయి ఆకాష్ వర్మ మెమోరబుల్ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలు

- పాల్గొన్న జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వెదిరేశ్వరం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్యేశ్వర వర్మ ఆధ్వర్యంలో కుమారుడు జ్ఞాపకార్థం దండు సాయి ఆకాష్ వర్మ మెమోరబుల్ టోర్నమెంట్ 10వ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీల కార్యక్రమంలో పాల్గొన్నరు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ అతి చిన్నవయసులోనే రాష్ట్ర స్థాయి నెట్ బాల్ ఆటలో అత్యున్నత ప్రతిభ కనబరిచి దురదృష్టవశాత్తు అకాల మరణానికి గురైన దండు సాయి ఆకాష్ వర్మ ఆసక్తి మేరకు తన తండ్రి దండు సుబ్రహ్మణ్యేశ్వర వర్మ ఈ రాష్ట్ర స్థాయి పోటీలను వెదిరేశ్వరం గ్రామంలో నిర్వహించటం జరుగుతుందని, ఇది క్రీడాకారుడు కుటుంబం చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన అన్నారు. అనంతరం జగ్గిరెడ్డి టాస్ వేసి ఈస్ట్ గోదావరి వర్సెస్ నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం వివిధ జిల్లాల నుండి విచ్చేసిన క్రీడాకారులను ఆయన పరిచయ కార్యక్రమం నిర్వహించి వారికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దండు సుబ్రహ్మణ్యం వర్మ, కర్రీ అశోక్ రెడ్డి, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలు ప్రారంభం

- క్రీడాకారులకు కుల, మత, ప్రాంతీయ బేధాలు ఉండవు...
- మట్టిలో మాణిక్యాల్లా క్రీడాకారులు రాణించాలి....
- దండు సాయి ఆకాశ్ వర్మ మెమోరియల్ నెట్ బాల్ పోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే బండారు





**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** రావులపాలెం మండలం వెదిరేశ్వరంలో 10వ రాష్ట్రస్థాయి దండు సాయి ఆకాష్ వర్మ మెమోరియల్ నెట్ బాల్ పోటీలను శనివారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. మొదటగా జ్యోతి ప్రజ్వలన చేసి జెండా వందనం నిర్వహించారు. అనంతరం సాయి ఆకాష్ వర్మ ఆత్మశాంతికి మౌనం పాటించారు. అనంతరం మైదానంలో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. క్రీడాకారులు గౌరవవందనాన్ని చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వెదిరేశ్వరంలో దండు వెంకట సుబ్రమణ్యం వర్మ, సుజాతమ్మ దంపతులు దండు సాయి ఆకాష్ వర్మ మెమోరియల్ టోర్నమెంట్ పేరుతో రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే బండారు తెలిపారు. నెట్ బాల్ క్రీడాకారుడిగా రాణిస్తూ, మంచి నెట్ బాల్ క్రీడాకారుడిగా ఎదుగుతున్న తరుణంలో అకాల మరణం చెందడం దురదృష్టమని బండారు అన్నారు. ఏకైక కుమారుడిని దూరం చేసుకున్న భారాన్ని సుబ్రమణ్యం వర్మ, సుజాతమ్మలు భరిస్తూనే చిన్న వయసు నుంచే ఆకాష్ వర్మ ఏ నెట్ బాల్ క్రీడ కోసం పరితపించేవారో, ఏ క్రీడ కోసం అయితే కృషి చేసేవారో అటువంటి క్రీడను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో సుబ్రమణ్యం వర్మ రాష్ట్ర స్థాయి పోటీలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే బండారు అన్నారు. 13 జిల్లాల నుంచి తరలివచ్చిన ఇంత మంది క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఇంత బృహత్తరమైన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.

క్రీడలకు రంగు, కులం, మతం, జాతి, ప్రాంత బేధాలు లేవని అన్నారు. మట్టిలో మాణిక్యాల లాగా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో వెలుగొందాలని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకటరాజు, గుత్తుల రాంబాబు, కొప్పిశెట్టి ప్రసాద్ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# ఏజెన్సీలో విద్య, ఆరోగ్యం పట్ల దృష్టి సారించండి

**– ప్రిన్సిపల్ సెక్రటరీ నాయక్**

**– అడ్డతీగలలో సుడిగాలి పర్యటన**



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీలోని గురుకుల ఆశ్రమ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యం వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మెరుగైన విద్యా విధానాలపై ప్రతి ఒక్క ఉపాధ్యాయుడితో పాటు అధికారులందరూ దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ అన్నారు. శనివారం ఏజెన్సీ అడ్డతీగల మండలంలో ఆయన సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మెట్లపాలెం, వేటమామిడి గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన మినీ విద్యుత్ కేంద్రాలను పరిశీలించారు. మెట్ల పాలెం వద్ద ఇంకా నిర్మాణంలో ఉన్న విద్యుత్ కేంద్రాన్ని అడ్డంకులు అధికమించి త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రాజెక్ట్ అధికారి స్మరణ రాజ్ కి సూచించారు. అలాగే వేటమామిడి విద్యుత్ కేంద్రంలో సామర్థ్యం పని తీరుపై సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడ్డతీగలలోని గురుకుల పాఠశాలతో పాటు బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులకు అందుతున్న వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రెండు పాఠశాలల్లోనూ మరుగుదొడ్లు మంచినీటి సరఫరా లో అసౌకర్యాలు ఉన్నట్లు విద్యార్థులు సిబ్బంది వెల్లడించడంతో ప్రాజెక్టు అధికారి సమక్షంలోనే ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వెంటనే నిధులు కేటాయించి వారంలోగా పరిస్థితి చక్క పెట్టాలని ప్రాజెక్ట్ అధికారి స్మరణ రాజ్ పరిస్థితి సమీక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతి గృహాల్లోను ఇకపై అనారోగ్యం కారణంగా ఏ ఒక్క విద్యార్థి మరణించకూడదని సంకల్పంతో ప్రభుత్వం ప్రతి ఒక్క విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత లక్ష్యంగా ముస్తాబు కార్యక్రమాన్ని రూపొందించిందని ఈ కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు పకడ్బందీగా అమలు చేయాలని దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని వసతిగృహాల్లోనూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల వార్డన్లతోపాటు ఉపాధ్యాయులు కూడా తరగతుల వారీగా బాధ్యతలు తీసుకొని ముస్తాబు కార్యక్రమం పై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అలాగే రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం ప్రైవేటు స్కూలుకు దీటుగా సాధించాలని అందుకోసం ఉపాధ్యాయులు వందరోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలని వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏ ఒక్క అధికారిని సిబ్బందిని క్షమించేది లేదని హెచ్చరించారు. స్థానిక ఆశ్రమ బాలికల పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు అదనంగా ప్రధానోపాధ్యాయురాలతో పాటు వార్డెన్ విధులను కూడా నిర్వహించడంతో వేరు వేరు ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పజెప్పాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సరిగ్గా నాలుగు రోజుల క్రితం ప్రభుత్వ విద్యా వ్యవస్థలోను ఆశ్రమ పాఠశాలలోనూ లోటుపాట్లపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి పరిస్థితి సమీక్షించి ఉన్నతాధికారులకు నివేదించడంతో ప్రిన్సిపల్ సెక్రటరీ నాయక్ ఆకస్మిక పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఆసుపత్రి పరిశీలించిన ఎస్టీ కమిషన్ చైర్మన్



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ మండల కేంద్రమైన అడ్డతీగలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి శనివారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ బొజ్జిరెడ్డి ఆకస్మికంగా పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆసుపత్రిలో రోగులకు అందుతున్న అత్యవసర సేవలతో పాటు ఇతర సేవలపై కూడా వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని వైద్యాధికారి సతీష్‌ను అడిగి తెలుసుకోవడమే కాకుండా లోటుపాట్లపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి నిరుపేద రోగుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాల పట్ల సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట రాష్ట్ర బిజెపి సెక్రటరీ స్వప్నకుమారితో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# హరిదాసులు, గంగిరెద్దు కళాకారులను ఆదరించాలి

**– హరిదాసు కళాకారులకు 5 వేల రూపాయల సంభావన**

**పెరవలి, మేజర్ న్యూస్ :** ధనుర్మాసం వచ్చిందంటే చాలు సంక్రాంతి నెల ప్రారంభం నుండి సంక్రాంతి పండుగ పూర్తి అయ్యేంత వరకు నెల రోజులు పాటు వేకువ జామునే బయలుదేరి హరినామ సంకీర్తనలతో గ్రామం అంతా తిరుగుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను నేటి తరం అందరికీ తెలియపరిచి అందరిని భక్తిపారవశ్యంలో ఉంచగలిగే వారే హరిదాసులు అని పెరవలి మండలం ఉసులుమర్రు గ్రామానికి చెందిన రామడుగుల సూర్యనారాయణ అన్నారు. డిసెంబర్ 27వ తేదీ శనివారం ఉసులుమర్రు గ్రామంలోని ఆయన స్వగృహం వద్ద మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ నేటి తరంలో అట్టి హరిదాసులను ప్రజలు పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. కానీ కుల వృత్తినే నమ్ముకుని ప్రతి సంవత్సరం హరినామ స్మరణతో విశేష సేవలు అందించిన ఇద్దరు హరిదాసులను 5 వేల రూపాయలతో పాటు నూతన వస్త్రాలు స్వయంపాకం దక్షిణ తాంబూలాలతో రామడుగుల సూర్యనారాయణ రమాదేవి దంపతులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా గంగిరెద్దు కళాకారుల బృందం సంక్రాంతి నెల మొత్తం ప్రతి గ్రామంలోని ఇంటింటికి తిరుగుతుందని వారిని కూడా ఆదరించాలనే తలంపుతో గత పది సంవత్సరాలుగా వారికి ఆవు దూడ గిత్తను నూతన వస్త్రాలు రూ. 1,116 రూపాయలు సంభావన ఇస్తున్నానని ఈ ఏడాది కూడా అదేవిధంగా తమ గోషాల్లో పుట్టిన గిత్త దూడను నూతన వస్త్రాలు నగదును తన భార్య రమాదేవితో కలిసి అందించారు. ఈ



కార్యక్రమంలో రామడుగుల సూర్యనారాయణ కుమార్తెలు లక్ష్మీ ప్రసన్న, కృష్ణ సత్య, పెరవలి మండలం వశిష్ట వినియోగదారుల సంఘం కన్వీనర్ సలాది ఉదయభాస్కరరావు, తోట సత్యనారాయణ, డౌలూరి శ్రీను, పువ్వల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాకరపర్రు అంగన్వాడి సెంటర్లలో ముస్తాబు కార్యక్రమం



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కాకరపర్రు గ్రామంలో డిసెంబర్ 27 వ తేదీ శనివారం స్థానిక 59, 60వ నంబర్ అంగన్వాడీ సెంటర్లలో ముస్తాబు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో చదువుతున్న పిల్లల యొక్క ప్రగతి వారి తల్లులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి అంగన్వాడి సెంటర్లో ముస్తాబు కార్యక్రమం నిర్వహించడం జరిగినది దీని ద్వారా ప్రతి పిల్లలు శుభ్రత పాటిస్తారని, ఏకాగ్రత ,స్కిల్ డెవలప్మెంట్ అలబడతాయని పిల్లలకి నేర్పించడం జరిగినది. ప్రతి నెల నాలుగో శనివారం అంగన్వాడి కేంద్రంలో ఉన్నట్టు వంటి బుక్స్ గురించి అంగన్వాడీ సెంటర్లో చేసే యాక్టివిటీస్ గురించి పిల్లల తల్లులకు వివరించి చెప్పేవి ఇంటికి వెళ్ళిన తర్వాత తమ పిల్లలతో చేయించమని తెలియ జేశామని అంగన్వాడి టీచర్ శ్రీదుర్గ మేజర్ న్యూస్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ కట్టుంగ శ్రీదుర్గ, అంగన్వాడి హెల్పర్ జ్యోతి మరియు ఏరియాలో ఉన్న తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## కానూరు అంగన్వాడి - 48 సెంటర్లో ముస్తాబు కార్యక్రమం



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం పెరవలి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కానూరు సెక్టర్లో కానూరు గ్రామంలోని 48వ నెంబర్ అంగన్వాడి సెంటర్లో డిసెంబర్ 27 వ తేదీ శనివారం ముస్తాబు కార్యక్రమం, ఈసీసీఈ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలు శుభ్రత ఎలా పాటించాలో పిల్లలకు ప్రాక్టికల్‌గా నేర్పించారు. చేసే పనిలో ఏకాగ్రత ,స్కిల్ పిల్లలకి నేర్పించడం జరిగినది.ప్రతి నెల నాలుగో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తూ ఉంటామని అంగన్వాడీ సూపర్వైజర్ సరోజినీ మేజర్ న్యూస్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నాగవేణి అంగన్వాడి హెల్పర్లు మరియు ఏరియాలో ఉన్న తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

## వెంకన్న ఆలయం వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్‌కు వినతి



**పెరవలి, మేజర్ న్యూస్ :**అన్నవరప్పాడు గ్రామంలో జాతీయ రహ దారి ప్రక్కనే వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఎంతో ప్రసిద్ధి చెంది ఏడు వారాలు ఏడు ప్రదక్షిణలతో నిరంతరం భక్తుల రద్దీతో అలరారుతున్నదని ఈ ఆలయానికి ప్రతి శనివారం సుమారు పదివేల మంది భక్తులు స్వామివారి దర్శనానికి విచ్చేస్తు న్నారని స్వామివారి ఆలయం జాతీయ రహదారి పక్కనే ఉండటం వలన ఎక్కువ మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకే ఆసక్తి చూపుతున్నారని అందువల్ల ఆలయం వద్ద భక్తులను ఎక్కించుకొనేందుకు ఇతర ప్రదేశాల నుండి వచ్చేటప్పుడు ఆలయం వద్ద ఆర్టీసీ బస్సులను ఆపు చేయటానికి రిక్వెస్ట్ స్టాపు ఇవ్వాలని ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ ఆర్టిసి ఉన్నతాధి కారులను కోరారు. డిసెంబర్ 27వ తేదీ శనివారం ఈవో రాధాకృష్ణ రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ తో తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ తో మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఉచిత బస్సు పథకం ప్రారంభమైన తర్వాత ఈ ఆలయం వద్ద బస్సులను ఆపటం లేదని అందువల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని కావున పూర్వం మాదిరిగానే వెంకన్న ఆలయం వద్ద ప్రయాణికులు భక్తులు ఎక్కుట దిగుట సందర్భాల్లో ఆర్టీసీ బస్సులను యధావిధిగా ఆపుచేయవలసిందిగా రావులపాలెం తణుకు డిపో మేనేజర్లను కోరారు.

# ఐసిడిఎస్‌ను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగు

**– మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ఐసిడిఎస్ సిబ్బందికి 5జి మొబైల్ ఫోన్లు, మెడికల్ కిట్స్ పంపిణీ**



**పెరవలి, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో పిల్లలు, గర్భిణీ మహిళలు, బాలింతలు, వితంతువులు సమగ్ర సంరక్షణ పొందేలా సమగ్ర శిశు అభివృద్ధి పథకం ఐసిడిఎస్‌ను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ క్రమంలో భాగంగా ఐసిడిఎస్ సేవల నాణ్యతను పెంచే లక్ష్యంతో డిసెంబర్ 27వ తేదీ శని వారం పెరవలి ఐసిడిఎస్ సిడిపిఓ ఆశారోహినికి అంగన్వాడి సిబ్బందికి అత్యాధునిక 5 జి మొబైల్ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఐసిడిఎస్ అనేది కేవలం సంక్షేమ పథకం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాల ఆరోగ్యం, పోషణ, విద్యకు పునాది అని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా 0–6 సంవత్సరాల పిల్లలకు పోషణ,ఆరోగ్య సంరక్షణ, ప్రీ–స్కూల్ విద్య ,గర్భిణీ మహిళలు, బాలింతలకు పోషకాహారం, వైద్య పర్యవేక్షణ వితంతువులు, ఆర్థికంగా బలహీన మహిళలకు సామాజిక భద్రత అందుతున్నదని తెలిపారు. 5 జి మొబైల్ ఫోన్లు–సేవలలో వేగం,పారదర్శకత కోసం ఐసిడిఎస్ సిబ్బందికి 5జి మొబైల్ ఫోన్లు అందజేయడం సేవలను డిజిటల్, పారదర్శకంగామార్చే దిశలో కీలక నిర్ణయం అనిమంత్రి అన్నారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గంలో ఉన్న 211మంది అంగన్‌వాడీ టీచర్లకు, 8 మంది సూపర్వైజర్లకు 5 జి మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాట్సాప్ గవర్నెన్స్ విజన్లో భాగంగా ఫీల్డ్ స్థాయి నుంచి నేరుగా ప్రభుత్వానికి రియల్ టైమ్ డేటా ప్రీ–స్కూల్ పిల్లల హాజరు, అభివృద్ధి వివరాల డిజిటల్ నమోదు కుటుంబాల సమగ్ర డేటా సేకరణ కు ఐసిడిఎస్ సిబ్బందికి మధ్య వేగవంతమైన కమ్యూనికేషన్ సాధ్యమవుతుందని తెలిపారు. మెడికల్ కిట్స్ పంపిణీ ప్రాథమిక ఆరోగ్య భద్రత సమగ్ర శిశు అభివృద్ధి పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్స్ పంపిణీ చేయడం ద్వారా పిల్లలు, గర్భిణీ మహిళల ఆరోగ్యాన్ని ప్రారంభ దశలోనే పర్యవేక్షించవచ్చని మంత్రి దుర్గేష్ తెలిపారు. దీనివల్ల పోషక లోపాలు, రక్తహీనత వంటి సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.

# జనవరి 2 నుంచి పెద్దాపురం డివిజన్‌లో రీ సర్వే ప్రారంభం

**– ఆర్డీఓ కె.శ్రీరమణి**

**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** రాష్ట్రప్రభుత్వం మరియు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దాపురం డివిజన్‌లో 11 మండలాల పరిధిలో 24 గ్రామాలలో 4వ విడత రీసర్వే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ పెద్దాపురం మండలంలో (ఆనూరు), గండేపల్లి మండలంలో (రాగంపేట, సూరంపాలెం), జగ్గంపేట మండలంలో (గొల్లల గుంట, కాండ్రేగుల, మన్యంవారి పాలెం, రాజపూడి), కిర్లంపూడి మండలంలో (బూరుగుపూడి),కోటనందూరు మండలంలో(భీమవరపుకోట, ఇందుగపల్లి),ప్రత్తిపాడు మండలంలో (పోదూరుపేట),రౌతులపూడి మండలంలో (బాపభూపాలపట్నం, మెరక చామవరం, గిడజం, తిరుపతమ్మపేట, శృంగవరం, కొత్తూరు, ఎన్.నరేంద్ర పట్నం), శంఖవరం మండలంలో (మండపం), తొండంగి మండలంలో (తొండంగి), తుని మండలంలో (కొలిమేరు, వల్లూరు, లోవకొత్తూరు), ఏలేశ్వరం మండలంలో (లింగంపర్తి), గ్రామాలలో రీసర్వే నిర్వహించడం జరుగుతుందని, దీనికి సంబంధించి టీమ్స్ వేయడం జరిగిందని ఆర్డీఓ శ్రీరమణి తెలిపారు.



ముందుగా ఆయా గ్రామాలలో రెవెన్యూ రీసర్వేపై గ్రామ సభ, అవగాహన ర్యాలీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, ఆర్డీఓ తెలిపారు.

# విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ బుక్స్ పంపిణీ చేసిన సబ్బెళ్ళ కృష్ణారెడ్డి



**అనపర్తి, మేజర్ న్యూస్ :** అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి తన కుమారుడు సబ్బెళ్ళ సురేష్ రెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా సబ్బెళ్ళ సురేష్ రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి సంస్థ ఏర్పాటు చేసిన పదవ తరగతి ఉచిత స్టడీ మెటీరియల్ బుక్‌లను శనివారం పలు పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు కృష్ణారెడ్డి మరియు ధాత్రి సంస్థ సభ్యులు చేతులమీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ భూమిపై భగవంతుడు మానవుడిగా మనకు ప్రసాదించిన జీవితం చాలా చిన్నదని, మన జన్మకు సార్ధకత చేకూరాలి అంటే ప్రతి ఒక్క మానవుడు సేవా గుణం అలవర్చుకోవాలని, తన కుమారుడు సురేష్ రెడ్డి చిన్న వయసులోనే డెంగ్యూ వ్యాధితో మరణించారని అతని జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ధాత్రి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత నాలుగు సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని ఈ సంవత్సరం కూడా పలు పాఠశాలల్లో సుమారు నాలుగు లక్షల రూపాయల విలువ చేసే స్టడీ మెటీరియల్ బుక్‌లను 600 మంది విద్యార్థిని విద్యార్థులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, శనివారం రామవరం, కుతుకులూరు, పొలమూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల నందు పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ బుక్‌లను ఉచితంగా పంపిణీ చేశామని ఇలాంటి కార్యక్రమంలో సురేష్ రెడ్డి తండ్రిగా పాల్గొనడం వ్యక్తిగతంగా బాధనుకలిగిస్తున్నా సురేష్ రెడ్డి స్నేహితులు నిర్వహిస్తున్న ధాత్రి చారిటబుల్ ట్రస్ట్ కార్యక్రమాలు సంతృప్తి కలిగిస్తున్నాయని ఇటువంటి కార్యక్రమాల ద్వారా నా కుమారుడు సమాజంలో సజీవంగా ఉంటాడు అనే సంతృప్తి కలుగుతుందని, విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి పుట్టిన ఊరుకు చదువుకున్న విద్యాలయానికి కన్న తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కృష్ణారెడ్డి అన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం సెంటర్లో స్థానిక ఎస్ఐ వెంకటరావు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం విరివిగా వాహనాలు తనిఖీ చేయడం జరిగింది. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా విధించడం జరిగింది. అలాగే వాహనదారులందరూ తప్పకుండా హెల్మెట్ ధరించాల్సిందిగా హెచ్చరించడం జరిగింది. రంపచోడవరంలో నిత్యం అంబేద్కర్ సెంటర్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటర్‌లో సాయంత్రం కాలేజీ వదిలే సమయంలో పోలీసు సిబ్బంది విధులు నిర్వహించేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా యువత త్రిబుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్‌తో వాహనాలు నడుపుతూ మిగతా వాహన దారులను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గతంలో రాత్రి 10 గంటల తర్వాత పోలీస్‌లు గస్తీ తిరుగుతూ ఆకతాయులు, మందు బాబులు బయట తిరగకుండా చర్యలు చేపట్టి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల రంపచోడవరంలో బైక్ దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

## ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించిన వైస్ ఛైర్మన్ నెక్కంటి




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘంలో శనివారం 12, 24వ వార్డులలో కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి సూచనల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్‌ఛైర్మన్ మాట్లాడుతూ పురపాలక సంఘంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగిందని, దానిలో భాగంగానే ప్రతీ వారం శానిటేషన్ వర్కర్లతో పారిశుద్ధ్య పనులు వార్డుల వారీగా (గ్యాంగ్ వర్క్) నిర్వహించడం జరుగుతుందని, ఆయన తెలుపుతూ సిబ్బందికి పారిశుద్ధ్య పనులపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట కౌన్సిలర్ కొట్టి పవన్ కిశోర్, పలువురు వైసిపి నాయకులు, తదితరులు ఉన్నారు.

## పదవ తరగతి ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ కనబరాలి

**– ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పదవ తరగతి ఉత్తీర్ణతపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, అలాగే విద్యార్థులు కూడా 100 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యాభ్యాసం చేయాలని, ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని చదలాడ హైస్కూల్‌ను ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ డివైఇఓ ఈరంకి ప్రభాకరశర్మతో కలసి పరిశీలించారు. దీనిలో భాగంగా పదవ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించి ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత చెందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల శిక్షణ కార్యక్రమం ప్రవేశపెట్టిందని, కావున విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తీర్ణత సాధించాలని ఆయన తెలిపారు.

# బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యం

**– బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** బాల్య వివాహ రహిత సమాజమే (దేశమే) లక్ష్యంగా బాల్య వివాహాల చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి తెలిపారు. బాల్య వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల కాంపెయిన్ లో భాగంగా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం మరియు మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్తంగా పిఠాపురం మండలం కందరాడ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ప్రధానోపాధ్యాయులు గంగాధర్ అధ్యక్షతన బాల్య వివాహలపై పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి మాట్లాడుతూ... బాల్య వివాహ ముక్త్ భారత్ కాంపెయిన్ 27 నవంబర్ 2025 నుండి 8 మార్చి 2026 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, బాల్య వివాహ రహిత దేశంగా భారత దేశాన్ని తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలను విద్యా రంగ సంస్థలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు పూర్తి కాకుండా మరియు అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయరాదని, బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం మరియు నేరమని, చిన్న తనంలో బాల్యవివాహాలు చేయడం వలన శారీరకంగా, మానసికంగా పరిపక్వత చెందరని, అనేక సమస్యలను ఎదుర్కొంటారని, బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం మరియు అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. ఎవరైనా ప్రేమ పేరుతో వేధించిన లేదా లైంగిక వేధింపులకు గురిచేసిన, ప్రలోభాలకు పాల్పడిన, బాల్య వివాహాలు చేస్తున్నట్లు సమాచారం ఉన్న వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీస్ 112 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ప్యానెల్ లీగల్ అడ్వకేట్ ఏ. గీతా, కే. సత్యవేణి మాట్లాడుతూ... హై కోర్టు ఉత్తర్వులు ప్రకారం మరియు 12వ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ వారు ఆదేశాలు మేరకు 100 రోజులు కాంపెయిన్ లో బాల్య వివాహ రహిత దేశంగా తీర్చి దిద్దాలనే దృక్పథంతో ఈ అవగాహన కార్యక్రమాలును సంబంధిత శాఖలు మరియు స్వచ్ఛంద సంస్థల సమన్వయముతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహించినా మరియు సహకరించినా లేదా వివాహం చేసినా... బాల్య వివాహ నిషేధ చట్టం2006 ప్రకారం రెండు సంవత్సరాలు జైలు శిక్ష మరియు ఒక లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుందని అన్నారు. పోక్సో చట్టం ప్రకారం కూడా చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ మరియు మానవ హారం చేయించారు. ఈ కార్యక్రమములో జీఎంఎస్కె బి. సావిత్రి, పారాలీగల్ వాలంటీర్ ఏం వి.సూరిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిహెచ్ఎం శాంతి సుప్రియ, ఉపాధ్యాయులు ఏం.గంగాధర్, బొజ్జియ్య, వరహాలు, ఇందిరా గాంధీ, ఆర్ వి ప్రసాద్, సీతా రామరాజు, సత్తిబాబు, గురుమూర్తి, అంగన్వాడీ కార్యకర్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శృంగార వల్లభ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

**– వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్కి ప్రత్యేక అలంకరణ**

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వాణా ధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,20,860/-, అన్నదాన విరాళాల ద్వారా రూ.61,519/-లు, కేశఖండన ద్వారా రూ.3,000/-, తులాభారం ద్వారా రూ.300/- లడ్డు ప్రసాదాల ద్వారా రూ.19,035/- మొత్తం రూ.2,04,714/-లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. వేద పండితులు ఆధ్వర్యంలో స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ మొయిళ్ళ సంధ్య కృష్ణమూర్తి, ధర్మకర్తలు, వేదపం డితులు పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ



సిబ్బంది కృష్ణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# లంకమాలపల్లి అంగన్వాడి సెంటర్లో ఈసీసీ డే



**పెరవలి, మేజర్ న్యూస్ :** కందవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లంక మాలపల్లి అంగన్వాడీ సెంటర్లో డిసెంబర్ 27వ తేదీ శనివారం ఈసీసీ డే కార్యక్రమం జరిగింది. పెరవలి సిడిపిఓ ఆసారోహిని ఆదేశాలు మేరకు బిసిడిస్ సూపర్వైజర్ ఎండి హసీనా లంకమాలపల్లి గ్రామంలో అంగన్వాడి సెంటర్లో నిర్వహించిన ఈసీసీడే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ షేక్ హసీనా మేజర్ న్యూస్తో మాట్లాడుతూ ప్రతి అంగన్వాడి సెంటర్లో నాలుగవ శనివారం ఈ కార్యక్రమ నిర్వహించడం జరుగుతుంది అన్నారు. అంగన్వాడీలో ప్రీస్కూల్ మెటీరియల్ అభివృద్ధల ద్వారా పిల్లలకి నేర్పించడం జరుగుతుంది అన్నారు. ఈసీసీడేలో కాస్ట్ మెటీరియల్తో ప్రీస్కూల్ తల్లులతో మెటీరియల్ తయారు చేయించి ప్రీస్కూల్లో డిస్ప్లే చేయడం జరిగినది. ఈసీసీ మెసేజ్ ద్వారా పిల్లలకి పిపి 1, పిపి 2 పుస్తకాలు రాయించి వారికి అవగాహన కల్పించాలని తల్లిలందరికీ వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా ఖండవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని అంగన్వాడి సెంటర్లలో ముస్తాబు కార్యక్రమం నిర్వహించడం జరిగినది అన్నారు. దీని ద్వారా ప్రతి పిల్లలు శుభ్రత పాటిస్తారని, ఏకాగ్రత ,స్కిల్ డెవలప్మెంట్ పిల్లలకి నేర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీలు , ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# స్వామిత్వ గ్రామ సభలలో పాల్గొన్న ఎంపిడిఓ, డిప్యూటి ఎంపిడిఓలు





**పెద్దాపురంరూరల్,మేజర్ న్యూస్:** పెద్దాపురం మండలం, చంద్రమాం పల్లి, తాటిపర్తి గ్రామాలలో శనివారం స్వామిత్వ గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాటిపర్తి గ్రామంలో ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ స్వామిత్వ సర్వేలో అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, అలాగే అంగీకారాలు తీసుకోవడం జరుగుతుందని, కావున గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపు సత్యకృష్ణ, కూటమి నాయకులు కొమ్మిరెడ్డి బుజ్జి, కూటమి నాయకులు, పంచాయతీ సెక్రటరీ వై.మనో సాయితేజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వి.రాజు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా చంద్రమాంపల్లి గ్రామంలో నిర్వహించిన స్వామిత్వ గ్రామ సభకు డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖరరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కురుమెల్ల లోవరాజు, గ్రామ టిడిపి అధ్యక్షులు రేలంగి బుజ్జి, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ రేలంగి వెంకట్రావు, మాజీ సర్పంచ్లు కేలంగి వెంకట భాస్కరరావు, కంటిబోయిన వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు వెన్నా జగదీష్, పంచాయతీ సెక్రటరీ షేక్ షావలి, ప్రజలు పాల్గొన్నారు.

# బస్వా రామ్మూర్తి సేవలు మరువలేనివి



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో మాజీ సర్పంచ్ స్వర్గీయ బస్వా రామమూర్తి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గతంలో రోడ్డు విస్తరణ పనుల కారణంగా తొలగించిన ఈ విగ్రహాన్ని గ్రామస్తులందరూ స్వచ్ఛందంగా ఏకమై ప్రముఖ శిల్పి కాగితాల కృష్ణ చేత నూతనంగా తయారు చేయించి తిరిగి ప్రతిష్టించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రామమూర్తి వారసులు మాట్లాడుతూ. స్వాతంత్ర్యానికి పూర్వం నుండి చిత్రాడ గ్రామానికి సుమారు నాలుగు పర్యాయాలు సర్పంచిగా సేవలు అందించిన రామమూర్తి, తన సొంత ఆస్తిని సైతం ప్రజల కోసం వెచ్చించిన మహోన్నత నాయకుడని, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ సమానంగా చూస్తూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచిన ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బస్వా రామమూర్తి వారసులు బస్వా ప్రకాష్ రావు, బస్వా గంగరాజు, మాజీ సర్పంచ్ బస్వా శ్రీనివాస్, పీబీసీ ఛైర్మన్ బస్వా నాగ పత్తులు, బస్వా చిట్టిబాబు (చిట్టిబాబు ఎంటర్ప్రైజెస్), గ్రామ ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గ్రామస్తులు ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.

# కేరళ తరహా అందాలు కోనసీమ సొంతం







**– సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలను విజయవంతం చేయాలి**
**– ఇనాగ్రేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు, జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్**

**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** కేరళ తరహా అందాలు కోనసీమ సొంతమని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కోనసీమకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు అందరూ కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యనందరావు, నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాసరావు లు అన్నారు. శనివారం ఆత్రేయపురం లాకుల వద్ద సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పడవ, ఈత,రంగవల్లులు, ఫుడ్ ఫెస్టివల్ పోటీలకు ఇనాగ్రేషన్ కార్యక్రమంలో వారు పాల్గొని వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు ముందుగా నిర్వహించనున్న ట్రోఫీ పోటీల సమయం దగ్గర పడుతుండటంతో అధికారులు ట్రోఫీకి ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పోటీలలో పాల్గొనే వారికి వసతుల ఏర్పాటు, అలాగే సందర్శనకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేసి ఈ గోదావరి ట్రోఫీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. ట్రోఫీలను ప్రతి ఒక్కరూ ఆస్వాదించి విజయవంతం చేసినట్లయితే ఈ ప్రాంతానికి భౌగోళిక గుర్తింపు లభించి కోనసీమ ప్రాంతానికి ప్రపంచ ప్రఖ్యాతి లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు, మండల తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్, జుజవరపు హరిబాబు, తోట రజిని, ముదునూరి గణపతిరాజు, మజ్జి తరుణ్, భావన శీను లను అభినందించారు. కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఎంపీడీవో బి.కే.ఎస్.ఎస్.వెంకట్ రామన్, డిఎస్పీ సుంకర మురళి, ఇన్చార్జి తాసిల్దార్ రామచంద్ర మూర్తి, ముళ్ళపూడి భాస్కరరావు, పి.ఎస్.రాజు, మద్దూరి సుబ్బారావు, చిలువూరి సతీష్ రాజు, కాయల జగన్నాథం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# 'పోలవరం' నూతన జిల్లా ఏర్పాటుకు వడివడిగా అడుగులు





**– జిల్లా కార్యాలయాలకు భవనాలు, స్థలాలు పరిశీలన**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం కేంద్రంగా ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన పోలవరం నూతన జిల్లా ఏర్పాటుకు వేగంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా పోలవరం జిల్లా ఏర్పాటుపై ప్రిలిమినరీ నోటిఫికేషన్ నెలరోజులు క్రితం విడుదల అయిన విషయం విధితమే. 2026 జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం నాటికి నూతన జిల్లాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందని సమాచారం. కాగా రంపచోడవరంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితర ప్రభుత్వ జిల్లా అధికారులు నూతన కార్యాలయాలు ఏర్పాటుకు పలు ప్రభుత్వ భవనాలు స్థలాలు రెవిన్యూ బృందాలు ఇప్పటికే పరిశీలించడం జరిగింది. అలాగే అసిస్టెంట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యాలయాల ఏర్పాటు తదితర అంశాలపై ఒక సమావేశాన్ని నిర్వహించారు. రంపచోడవరంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలు స్థలాలపై ఈ సమావేశంలో అధికారులు చర్చించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం కోసం సిరిగిందలపాడులోని వృత్తి శిక్షణా కేంద్రం వైటిసి భవనాన్ని పరిశీలిస్తున్నారు. అలాగే జిల్లా ఎస్పీ కార్యాలయం పీఎంఆర్సి భవనాన్ని పరిశీలన చేస్తున్నారు అలాగే మిగతా ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకు ప్రస్తుతం నిర్వహణలో ఉన్న భవనాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. అలాగే జిల్లా కేంద్రం పరిపాలనాపరంగా ప్రారంభమైన తర్వాత కొత్త కార్యాలయాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించడానికి కార్యచరణ చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ రంపచోడవరంలో పర్యటించి పీఎంఆర్సి, హెచ్‌ఎంటిసి, వైటిసి, ఐటీడీఏ భవనాలను, స్థలాలను పరిశీలించి స్థానిక అధికారులకు సూచనలు చేయడం జరిగింది. అలాగే రంపచోడవరంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు అధికారులు, ఉద్యోగుల నివాస గృహాలు పాడుతున్నందున వాటిని తొలగించి ఆ స్థానంలో కొత్త భవనాలు నిర్మించడానికి అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. పోలవరం నూతన జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం నుండి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడానికి ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చి, అభ్యంతరాలు సూచనలు నెల రోజులు లోపు ఇవ్వాలని కోరారు. కాగా జిల్లా సరిహద్దులు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామాలు, జనాభా భౌగోళిక విస్తీర్ణం జనాభా, ఇతర వనరులపై ప్రభుత్వానికి తుది నివేదిక అందిన తర్వాత కొత్త జిల్లాపై గెజిట్ నోటిఫికేషన్ వెలువడుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.



# గల్ఫ్ జనసేన గ్రూప్ ఆధ్వర్యంలో పేదలకు భోజనాలు పంపిణి

**అమలాపురం, మేజర్ న్యూస్ :** గల్ఫ్ జనసేన కమ్యూనిటీ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా శనివారం రోడ్డు పక్కన నివాసం ఉండే పేదలకు, వృద్ధులకు సుమారు 100 మందికి భోజనాలు పంపిణీ చేసారు. ఇటువంటి సేవ కార్యక్రమాల్లో చెయ్యడంలో గల్ఫ్ జనసేన ఎల్లప్పుడు ముందు ఉంటుందని ఇలాంటి కార్యక్రమాలు చెయ్యడానికి సహకరిస్తున్న వారందరికీ గ్రూప్ సభ్యులు అడపా శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోనపురెడ్డి సాయిబాబా, పత్తి చంద్రశేఖర్, వర్ధినిడి మార్కండేయ, యెరుబండి శ్రీరామచంద్రమూర్తి, జనసైని కులు, జనసేన మహిళలు పాల్గొన్నారు.

## కోనసీమ తిరుమల వెంకటేశ్వరుని క్యాలెండర్ ఆవిష్కరణ

**– పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి 2026 వార్షిక క్యాలెండర్‌ను శనివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవిష్కరిం చారు. దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటి కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు ఆధ్వర్యంలో అలయ ప్రాంగణంలో కాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి కీర్తి ప్రతిష్టలు రాష్ట్రం నలుమూలల ప్రఖ్యాతి చెందడం హర్షణీయం అని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించడంతోపాటు కోట్లాది రూపాయలతో ఆలయ అభివృద్ధికి రోడ్ల విస్తరణ భక్తుల వసతి గదులు నిర్మాణానికి నిధులు మంజూరు సాధించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు సోమవారం జరగనున్న ఆలయ పాల కమండలి ప్రమాణ స్వీకార ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి వారి వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొనడం సంతోష దాయకమని, స్వామివారి అనుగ్రహం అందరి మీదా ఉండాలని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కూటమినాయకులు ముదునూరి రాంబద్రరాజు, కంఠం శెట్టి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో 'మైక్రోషిఫ్ట్' వేడుకలు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నిమైక్రో షిఫ్ట్‌వేడుకలు ఘణంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు.ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 27న జరుపుకునే లూయిూ పాశ్చర్ జన్మదినం నాడు మైక్రో బయాలజీ వేడుకలుఘనంగా నిర్వహించినట్లు సూక్ష్మ జీవశాస్త్రంలో మంచి,చెడు జీవులను గుర్తించి వేరు చేసే ప్రక్రియకు దిశానిర్దేశం జరిగింది. వ్యాధి వచ్చినప్పటికంటే రాకుండా తీసుకునే జాగ్రత్తలే మేలని ముందుగా వాక్సినేషన్ ద్వారా వ్యాధులనురాకుండా ముందుగానే కట్టడి చేయవచ్చని సూచించారు అని తెలియజేశారు.ఆదిత్య మహిళ డిగ్రీ మరియు పి.జి. కళాశాల ప్రిన్సిపాల్‌కె.కరుణ మాట్లాడుతూప్రతి సంవత్సరం డిసెంబర్ 27న జరుపుకునే నిలూయిూ పాశ్చర్ జన్మదినం నాడు, అతను ప్రతిపాదించిన రోగకార క్రిమి సిద్ధాంతం వైద్య శాస్త్రంలో ఒక విప్లవాత్మకమైన భావన. ఈ సిద్ధాంతం ప్రకారం, అనేక అంటువ్యాధులు కేవలం గాలి సోకడం వల్ల కాకుండా, గాలిలో ఉండే లేదా పరిసరాలలో ఉండే హానికరమైన సూక్ష్మజీవుల వల్ల సంభవిస్తాయని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఆదిత్య మహిళ డిగ్రీ మరియు పి.జి. కళాశాలకు విచ్చేసిన డా॥ సారా పాలపర్తి వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు ప్రభుత్వడిగ్రీకళాశాల రామచంద్ర పురం. ఆమె పీహెచ్‌డి(బోటని), ఎంఎస్సీ(బోటని) చేశారు. డిసెంబర్ 27న నిర్వహించిన 'మైక్రో షిఫ్ట్' లూయిూ పాశ్చర్ జన్మదిన సందర్భంగా ఆమె పాశ్చరైజేషన్ అంటే ద్రావాలను ఒక నిర్దిష్ట ఉష్ణోగ్రతకు వేసి, కొంత సమయం పాటు ఉంచి, తర్వాత త్వరగా చల్లబరచడం అని,ఇది హానికరమైన బాక్టీరియా, వైరస్‌లను చంపేస్తుందని, ఆద్రవంసు రక్షితంగా తాగడానికి సిద్ధంగా ఉంటుంది అని తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థినీలకు కళాశాల నిర్వహించిన పిపిటి, ప్రోజక్ట్,జామ్,పోస్టర్ ప్రసెంటేషన్ పోటీలు నిర్వహించారు. ఇందులో బాగా చేసిన విద్యార్థినీలకు, ప్రధమ, ద్వితీయ బహుమతులు ప్రిన్సిపాల్ కె.కరుణ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాలవైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, లైఫ్ సైన్స్‌హెచ్‌ఓడి కె.నవ్య, రసాయన శాస్త్రం విభాగ అధిపతి యు.నాగవల్లి, మరియు మైక్రోబయోలజీ అధ్యాపకులు ఎ.సాయి ఝూన్సి, ఎస్.భువనేశ్వరి క్రియాశీలంగా నిమగ్నమై పాల్గొన్నారు.